AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
27-3-2026 (Friday)
MAIN EDITION

## యూఏఈలో భారీ వర్షాలు..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో వర్షం బీభత్సం సృష్టించింది. దుబాయ్ సహా చాలా ప్రాంతాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. అబుదాబి, షార్జా తదితర ప్రాంతాల్లో భారీ వాన పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాతావరణంలో మార్పులతో తీవ్రమైన గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో విజిబిలిటీ తగ్గింది. అధికారులు దేశవ్యాప్తంగా అత్యవసర చర్యలను ప్రారంభించి, భద్రతా హెచ్చరికలను జారీ చేశారు.

## వేములవాడలో వివాహం చేసుకున్న హిజ్రాలు



**అక్షరటుడే, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శైవ క్షేత్రం అయిన వేములవాడలో యేటా శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. రాజన్న సన్నిధిలో శ్రీరామ నవమి సందర్భంగా హిజ్రాలు, ట్రాన్స్ జెండర్స్, జోగినిలు పరమశివునిని నాధునిగా భావించి వివాహం చేసుకుంటారు. రాములోరి కల్యాణం జరుగుతున్న సమయంలోనే పరమశివుని మదిలో తలుచుకుని హిజ్రాలు వివాహం చేసుకున్నారు.

## ఏప్రిల్ 2న 'రామ' గ్లింప్స్ విడుదల



**అక్షరటుడే, సినిమాడెస్క్ :** రామాయణం చిత్రానికి సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. శ్రీరాముడి పాత్ర గ్లింప్స్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 2026లో విడుదల కానున్న రామాయణం చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. రామ గ్లింప్స్ తేదీని తాజాగా నిర్మాత నమిత్ మల్హోత్ర ప్రకటించారు.

## పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై పన్ను




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాలకు ఎగుమతి చేసే పెట్రోల్, డీజిల్‌పై భారీగా పన్ను విధించింది. పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వివరాలు వెల్లడించారు. దేశీయ సరఫరాకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## స్టాక్ మార్కెట్‌లో మళ్లీ బ్లడ్ బాత్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల లాభాల జోరుకు బ్రేక్ పడింది. దేశీయ సూచీలు భారీగా నష్టపోయాయి. 1690 పాయింట్ల నష్టంతో 73,583 వద్ద సెన్సెక్స్, 486 పాయింట్ల నష్టంతో 22,819 వద్ద నిఫ్టీ ముగిశాయి. రూ. 9 లక్షల కోట్లు ఆవిరి అయ్యాయి. కాగా.. పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు తగ్గించడంతో ఓఎన్జీసీ భారీగా లాభపడింది.



## ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించిన ట్రంప్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తులో భారత్‌అమెరికా మధ్య బంధం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. నేను, ప్రధాని మోదీ చేతల మనుషులమని రాసుకొచ్చారు. ఈ విషయాన్ని ఇండియాలోని అమెరికన్ ఎంబసీ పోస్ట్ చేసింది.




## బాక్స్ ఆఫీస్ వద్ద 'ధురంధర్2' దూకుడు..

**అక్షరటుడే, సినిమాడెస్క్:** బాక్స్ ఆఫీస్ వద్ద 'ధురంధర్2' దూసుకుపోతుంది. ఈ సినిమా విడుదలైన వారం రోజుల్లోనే రూ.1000కోట్ల మార్కును క్రాస్ చేసినట్లు నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ వెల్లడించింది. అతి తక్కువ రోజుల్లో ఈ ఫీట్ సాధించిన మూవీగా నిలిచిందని పేర్కొంది. కేవలం 8 రోజుల్లోనే రూ.1088 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు తెలిపింది.

**రాష్ట్రంలో కొత్త పార్టీ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రస్తుతం ఉన్న పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో తాము పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఏప్రిల్ 25న పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటిస్తామని వెల్లడించారు. మేడ్చల్ లోని మునీరాబాద్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.** **–అక్షరటుడే, హైదరాబాద్‌ప్రతినిధి**



# ఏప్రిల్ 25న కొత్త పార్టీ..

**■ అన్నివర్గాలను కలుపుకొని వెళ్తాం ■ ప్రజా సమస్యలపై పోరాడుతాం ■ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ ఏర్పాటుపై నిజామాబాద్‌లో ప్రకటించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆమె నగరంలోని రఘునాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కొత్త పార్టీ పెడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు ముహూర్తం ఉందన్నారు. మేడ్చల్‌లో మునీరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీని ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో, రాజకీయాల్లో మార్పు రావాలనుకున్న వారు రావాలని ఆహ్వానించారు. ఆ రోజు పార్టీ పేరు ప్రకటించి, జెండా ఎగురవేస్తామన్నారు. ఉదయం 8 గంటల్లోపు కార్యకర్తలు చేరుకోవాలని సూచించారు.

### నిజామాబాద్ కోడలిని..

కవిత తెలంగాణ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. రాముడు తన ప్రజలను గుండె హత్తుకొని పాలన చేశారన్నారు. ఈ క్రమంలో శ్రీరామ నవమి రోజు కొత్త పార్టీపై ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు. తాను నిజామాబాద్ కోడలిని అన్నారు. ఇక్కడ పుట్టిన ఏ ఆలోచన అయినా విజయవంతం అవుతుందన్నారు. రాష్ట్రంలో నీళ్లు, నియామకాలు సాధించుకోలేక పోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

### పోరాటాలు చేశాం

తాను తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు కవిత తెలిపారు. రాష్ట్రం రాకముందు తెలంగాణ ఉద్యమంలో పోరాటాలు చేశామన్నారు. రాష్ట్రం వచ్చాక సైతం ప్రజల సమస్యలను లేవనెత్తినట్లు గుర్తు చేశారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇటీవల డీఎస్పీ పార్టీతో కలిసి నిర్వాసితుల కోసం నిరాహార దీక్ష చేశామన్నారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి పట్టాలు ఇచ్చిందన్నారు. కొత్త పార్టీ ప్రకటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి జాగృతి నాయకులు, కార్యకర్తలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ పని చేస్తుందన్నారు. సర్వోదయ తెలంగాణ సాధన కోసమే పార్టీ పెడుతున్నట్లు తెలిపారు.

### నంబర్ వన్ పార్టీగా..

తాము ఎవరికి బీ పార్టీగా ఉండబోమని కవిత అన్నారు. నంబర్ వన్ పార్టీగా ఎదుగుతామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో అధికారంలోకి వస్తామన్నారు. రాముడిని ఆదర్శంగా తీసుకొని పని చేస్తామన్నారు. అన్నివర్గాలను కలుపుకొని వెళ్తామన్నారు. తాను ఎక్కడి నుంచి పోటీ చేస్తానని పార్టీ ఏర్పాటు అనంతరం ప్రకటిస్తానన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ప్రాంతీయ పార్టీ లేదన్నారు.

## అయోధ్యలో బాలరాముడి నదుట సూర్యతిలకం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అయోధ్యలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. శ్రీరామ నవమి రోజు బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు పడటంతో భక్తులు తన్మయత్వం చెందారు. దేశవ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాముడి జన్మ స్థలం అయోధ్యలో సంబరాలు ఆకాశాన్ని అంటాయి. బాలరాముడి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఈ క్రమంలో శుక్రవారం ఆలయంలోని రాముడి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకాయి. నుదిటిపై కిరణాలు తిలకంలా దర్శనం ఇచ్చాయి. మధ్యాహ్నం 12 గంటలకు రామ్ లల్లా విగ్రహం నుదుటిపైకి శాస్త్రీయ పద్ధతిలో సూర్యకిరణాలు పడ్డాయి.

## మాజీ ప్రొఫెసర్‌కు సైబర్ నేరగాళ్ల టోకరా..



**అక్షరటుడే, వరంగల్:** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కొత్త తరహా మోసాలతో ప్రజల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. తాజాగా వరంగల్ నిట్ మాజీ ప్రొఫెసర్‌కు సైబర్ నేరస్తులు టోకరా వేశారు. పెట్టుబడుల పేరిట నమ్మించి రూ. కోటి కాజేశారు. సుధా కర్ అనే వ్యక్తి గతంలో నిట్‌లో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. దీంతో అందులో కనిపించిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. అక్కడ తన వాట్సాప్ నంబర్ పంచుకున్నాడు. సదరు మాజీ ప్రొపెసర్‌కు వాట్సాప్‌లో మెసేజ్ వచ్చింది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని అందులో ఉంది. దీంతో ఆ లింక్‌పై క్లిక్ చేశాడు. అనంతరం ఆయనను 'హెచ్ 18' అనే వాట్సాప్ గ్రూప్‌లో సైబర్ నేరగాళ్లు చేర్చారు. తాము చెప్పినట్లు పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించారు. అనంతరం కంపెనీ అకౌంట్స్ మేనేజర్‌గా ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. ఆయన చెప్పినట్లు సదరు మాజీ ప్రొఫెసర్ జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.1 కోటి వరకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాత లాభాలు రాకపోవడం, తన డబ్బులు సైతం తిరిగి ఇవ్వకపోవడంతో సుధాకర్ మోసపోయినట్లు గ్రహించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## పెళ్లి వార్తలపై స్పందించిన సాయి పల్లవి



**తన పెళ్లిపై వస్తున్న రూమర్లకు హీరోయిన్ సాయి పల్లవి ఫుల్ స్టాప్ పెట్టారు. ఓ కార్యక్రమంలో జర్నలిస్టులు పెళ్లి గురించి అడగ్గా ఈ బ్యూటీ స్పందించారు. ప్రస్తుతం తన దృష్టి కెరీర్ పైనే ఉందని స్పష్టం చేశారు. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదని చెప్పారు. కాగా.. ప్రస్తుతం ఈ భామ బాలీవుడ్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు.**

**–అక్షరటుడే, సినిమాడెస్క్**

## లాక్‌డౌన్ వార్తలపై స్పష్టత ఇచ్చిన కేంద్రం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం ముదురుతుండడంతో ఇంధన సంక్షోభం దిశగా ప్రపంచం సాగుతోంది. ఈ నేపథ్యంలో దేశంలో లాక్ డౌన్ ప్రచారం జరుగుతోంది. అయితే అవి వదంతులేనని కేంద్రం స్పష్టత ఇచ్చింది. అలాంటి ప్రతిపాదనలు ఏమీ లేవని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ తెలిపారు. ఇలాంటి రూమర్స్ వ్యాప్తి చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం బాధ్యతారహితమైన హానికరమైన చర్య అని ఆయన అభివర్ణించారు. 'క్లిష్ట సమయంలో మనం ప్రశాంతంగా, బాధ్యతగా, ఐక్యంగా ఉండాలి. రూమర్స్ వ్యాప్తి చేయడం చాలా తప్పు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సరఫరా సాధారణంగానే ఉంది. దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు సాధారణంగా నడుస్తున్నాయి' అని మంత్రి హర్దీప్ పూరి వివరించారు. దేశంలో కోవిడ్ తరహా లాక్‌డౌన్ విధించే అవకాశమే లేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. కొంతమంది రాజకీయా నాయకులు లాక్‌డౌన్ గురించి మాట్లాడి ప్రజలను భయపెట్టడం బాధాకరమన్నారు.




## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిన కేంద్రం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు పెరిగిన విషయం తెలిసిందే. దీంతో పలు దేశాల్లో ఇంధన ధరలను పెంచగా.. కేంద్రం మాత్రం పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలతో నష్టాల్లో ఉన్న ఆయిల్ కంపెనీలకు ఉపశమనం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఆయిల్ కంపెనీలపై ఒత్తిడి తగ్గిస్తూ రిటైల్ ధరలు పెంచకుండా.. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాలను తగ్గించింది. శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దీంతో కేంద్రం విధించే పన్నులు లీటరు పెట్రోల్‌పై రూ.3కి, డీజిల్‌పై సున్నాకు తగ్గాయి. అయితే ఈ తగ్గింపుతో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం లేదు.

## వివాదంలో చిక్కుకున్న మహారాష్ట్ర మంత్రి..



**అక్షరటుడే, ముంబై:** మహారాష్ట్ర మంత్రి నరహరి జిర్వాల్ వివాదంలో చిక్కుకున్నారు. ఓ ట్రాన్స్‌జెండర్‌తో ఆయన సన్నిహితంగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నరహరి జిర్వాల్ మహారాష్ట్ర ఆహార, ఔషధాల నియంత్రణ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన తన అధికారిక నివాసంలో ఓ ట్రాన్స్‌జెండర్‌తో రాసలీలలు జరిపిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గం నుంచి ఆయనను తప్పించాలని డిమాండ్ చేసింది. కాగా.. దీనిపై మంత్రి స్పందిస్తూ.. బ్లాక్‌మెయిల్ కోసం వీడియో రిలీజ్ చేశారని పేర్కొన్నారు. ఇది మార్ఫింగ్ చేసిన వీడియో అన్నారు.